సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం । 4 । నవంబర్ । 2024



సేవాదళ్ ఉత్సవాలకు రండి

సిరిసిల్లటౌన్: హైదరాబాద్‌లో ఈనెల 20న నిర్వహించే కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలకు భారీగా తరలిరావాలని జిల్లా ఇన్‌చార్జి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



సల్లంగా చూడు పోచమ్మతల్లీ

ముస్తాబాద్(సిరిసిల్ల): సల్లంగా చూడు పోచమ్మ తల్లీ అంటూ గూడెం గ్రామస్తులు ఆదివారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రోడ్డు అలైన్‌మెంట్ పరిశీలించండి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు బీజేపీ నేతల వినతి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

సిరిసిల్లటౌన్: కొత్తగా నిర్మించే జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను పరిశీలించాలని బీజేపీ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరారు. రోడ్డు విస్తరణ పనుల అలైన్‌మెంట్ పరిశీలించాలని కోరుతూ ఆదివారం కరీంనగర్‌లోని మంత్రి ఇంట్లో కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు నిర్మించే నేషనల్ హైవే తంగళ్లపల్లి- బద్దెనపల్లి-పద్మనగర్ ప్రాంతాల్లో అనేక మలుపులతో ఉందన్నారు. నేషనల్ హైవేలు ఎక్కడా ఇలా మలుపులతో ఉండవని, ఇప్పుడున్న అలైన్‌మెంట్ పరోక్షంగా ఎవరికో లబ్ధి చేయాలనే ఉద్దేశ్యంతోనే తయారు చేసినట్లు అర్థమవుతుందన్నారు. రోడ్డు అలైన్‌మెంట్‌ను రద్దు చేసి మలుపుల్లేకుండా కొత్త అలైన్‌మెంట్ తయారు చేయించాలని, భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వేములవాడఅర్బన్: పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఏఐటీయూసీ నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికులకు వర్క్ టు ఓనర్ పథకం అమలు చేయాలని కోరారు. నాలుగేళ్ల క్రితం నాటి వేతన ఒప్పందాన్ని నేటికీ అమలు చేయని యజమానులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, పెంట మల్లయ్య ఉన్నారు.

పాడిపరిశ్రమతో రైతుల ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి(చొప్పదండి): పాడిపరిశ్రమతో పాడిరైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని స్తంభంపల్లిలో ఏర్పాటు చేసిన పాలకేంద్రాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. పాడిరైతులకు అన్ని రకాల ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, ముదుగంటి సంతుప్రకాశ్‌రెడ్డి, పులి లక్ష్మీపతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, సంబ లక్ష్మీరాజం, పిట్టల రమేశ్ ఉన్నారు.

చంద్ర పుల్లారెడ్డికి నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: శాంతినగర్‌లోని ఏఐఎఫ్‌టీయూ న్యూ ఆఫీసులో ఆదివారం కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.కిశోర్ హాజరై మాట్లాడారు. మార్క్సిస్టు మేధావిగా పుల్లారెడ్డి పేదల పక్షాన పోరాటాలు చేశారన్నారు. పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు సోమిశెట్టి దశరథం, భామండ్ల రవీందర్, మూశం ఆంజనేయులు, ముత్తంగి వసంత, బొద్దుల శ్రీహరి, తడుక రాములు, ఆకెన్ని సత్తయ్య పాల్గొన్నారు.

కన్నుపడితే కబ్జాలే !

- ఆక్రమణలో ప్రభుత్వ భూములు
- చందుర్తిలో కల్లాల భూములు అన్యాక్రాంతం
- తంగళ్లపల్లిలో కుంచించుకుపోతున్న మల్లప్పకుంట
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు




ధాన్యం కల్లం కోసం స్థలాన్ని చదును చేసుకోవాలని సూచిస్తున్న తహసీల్దార్, పక్కనే సీఐ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): ఖాళీ జాగ కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. ప్రభుత్వ భూములు అయినా ఆక్రమణదారులు వదలడం లేదు. చందుర్తి మండల కేంద్రంలో వందలాది ఎకరాల భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంది. తంగళ్లపల్లి మండల కేంద్రంలో మల్లప్పకుంట కుంచించుకుపోతుంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కబ్జాదారుల ఆగడాలను అడ్డుకోవడం లేదు. జిల్లాలో ఆక్రమణలపర్వంపై ఫోకస్ స్టోరీ.

కల్లాల భూములు కబ్జా

రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబోసేందుకు స్థలం లేదని పలువురు నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లపై ధాన్యం పోయడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని కల్లాల కోసం స్థలం కేటాయించాలని రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య చందుర్తి తహసీల్దార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందించారు. స్పందించిన వారు చందుర్తి మండల కేంద్రం శివారులోని 176వ సర్వేనంబర్‌లోని సుమారు 10 ఎకరాల భూమిని చదును చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్, చందుర్తి సీఐలు క్షేత్రస్థాయికి వచ్చి సూచించారు. అయితే ఆ స్థలాన్ని గతంలో నుంచి తానే కబ్జాలో ఉన్నానని ఒకరు మాజీ ప్రజాప్రతినిధుల అండదండలతో కల్లాల కోసం చేస్తున్న చదును పనులను అడ్డుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా కల్లాల స్థలాన్ని కేటాయించాలని అధికారుల చుట్టూ తిరిగిన మాజీ ప్రజాప్రతినిధి సైతం ప్రస్తుతం సైలెంట్ అయిపోయినట్లు రైతులు చర్చించుకుంటున్నారు. గతంలో మండల కేంద్రం శివారులోని బోడగుట్ట ప్రాంతంలో సబ్ మార్కెట్‌కు కేటాయించిన 5 ఎకరాల స్థలం సైతం ఆక్రమించి, పట్టా చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామంలోని అనేక మంది రాజకీయ నాయకుల సహకారంతో పట్టా చేసుకున్నట్లు ప్రచారంలో ఉంది. అసైన్డ్ కమిటీ ప్రొసీడింగ్స్ ఉన్న వారికి పట్టాకెక్కని భూములనూ రెవెన్యూ అధికారుల సహకారంతో పదుల సంఖ్యలో పట్టాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ తహసీల్దార్ తమ సామాజికవర్గానికి చెందిన వారికి ఎకరాల కొద్ది భూములను పట్టా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.



గతంలో సిద్ధం చేసిన భూముల వివరాలు

కల్లాల కోసం స్థలాన్ని కేటాయించాం



చందుర్తి శివారులోని 176 సర్వేనంబర్‌లో సుమారు 10 ఎకరాల భూమిని చదును చేసుకోవాలని రైతులకు సూచించాం. చదును చేసుకునేందుకు కావాల్సిన జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్ యజమానులకు చెబుతామని తెలిపాం. ఎవరైన అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో చదును చేయిస్తామని చెప్పినం. ఇప్పుడు రైతులు ముందుకురావడం లేదు.

– శ్రీనివాస్, తహసీల్దార్, చందుర్తి

మల్లప్పకుంట మాయం !



2013లో మల్లప్పకుంట గూగుల్ మ్యాప్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మల్లప్పకుంటపైనే కబ్జాదారులు కన్నేశారు. స్థానిక మండెపల్లి చౌరస్తాలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మల్లప్పకుంట ఒకప్పుడు మూడెకరాలలో విస్తరించి ఉండేది. ప్రస్తుతం సగానికి పైగా విస్తీర్ణం పడిపోయింది. ఈ విషయం గూగుల్ మ్యాప్‌తో తేటతెల్లమవుతోంది. 2013లోని గూగుల్‌మ్యాప్‌తో ప్రస్తుతం మ్యాప్ పోలిస్తే మల్లప్పకుంట చుట్టూ అనేక నిర్మాణాలు వెలిసినట్లు తెలుస్తుంది. ప్రధాన రహదారి వైపు ఈ ఆక్రమణలు కనిపిస్తున్నాయి. చెరువులు, కుంటలను రక్షించాల్సిన ఇరిగేషన్ అధికారులు ఇటు వైపు చూడడం లేదు. ఇలాగే వదిలేస్తే మల్లప్పకుంట మాయమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మల్లప్పకుంటను కాపాడాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మండల కేంద్రంలోని మల్లప్పకుంటను రక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. ముందుగా కుంట మొత్తం విస్తీర్ణాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తాం. అనంతరం మల్లప్పకుంట కబ్జాకు గురైనట్లు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– జయంత్‌కుమార్, తహసీల్దార్

ధాన్యం సేకరణలో వేగం పెంచండి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



గంభీరావుపేట: కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్/గంభీరావుపేట(సిరిసిల్ల): ధాన్యం సేకరణలో వేగం పెంచాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ముస్తాబాద్ మండలం నామాపూర్, గూడెం, చీకోడు, చిప్పలపల్లి, నామాపూర్, గంభీరావుపేట మండలం గోరింటాల, జగదాంబతండా, రాజేశ్వర్‌రావునగర్, దమ్మన్నపేట, గజసింగవరం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆదివారం తనిఖీ చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 222 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీసీవో రామకృష్ణ, డీఎస్‌వో వసంతలక్ష్మి, డీఎం రజిత, తహసీల్దార్‌లు సురేశ్, భూపతి, సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, సీఈవో రాజిరెడ్డి ఉన్నారు.

నేతన్నలను ఓనర్లుగా చేయాల్సిందే..

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: నేతన్నలను ఓనర్లు చేయడానికి ప్రవేశపెట్టిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీస్‌లో ఆదివారం నిర్వహించిన పవర్‌లూమ్స్ అనుబంధ రంగాల నాయకుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల అపెరల్ పార్కు వద్ద వర్కర్ టు ఓనర్ పథకానికి షెడ్లు నిర్మించారన్నారు. ఆ తర్వాత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పథకం అమలు చేయలేదన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు సదరు షెడ్లను ఇతరులకు కేటాయించడానికి సన్నద్ధమైతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరుతూ సోమవారం సిరిసిల్లలో నిరసన తెలపనున్నట్లు తెలిపారు. సిరిమల్ల సత్యం, ఒగ్గు గణేశ్, గుండు రమేశ్, ఉడుత రవి, దోమల రమేశ్, సుదన్, సత్యం, శ్రీకాంత్, పోచమ్మ పాల్గొన్నారు.

ఆ ఠాణాలకు ఏమైంది ?!

- పోస్టింగ్‌కు ఆసక్తి చూపని ఎస్సైలు
- ఇన్‌చార్జీలతో ఇక్కట్లు

సిరిసిల్లక్రైం: పోలీస్‌శాఖలోని ఎస్సై స్థాయి అధికారులు ఏదో ఒక ఠాణాలో ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తించాలని కోరుకుంటారు. పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధుల లెటర్లతో పైరవీలు చేసుకుంటారు. అయితే చందుర్తి సర్కిల్‌లోని కోనరావుపేట, చందుర్తి పోలీస్‌స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలు లేకుండానే రెండు నెలలు గడిచిపోయాయి. ఆయా ఠాణాలలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు.

ఫిర్యాదులే కారణమా ?

కోనరావుపేట, చందుర్తి ఠాణాల్లోని అధికారులపై ప్రస్తుత అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు అనేక ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పోలీస్ విధుల్లో కలుగజేసుకుంటుండడం ఇబ్బందిగా మారినట్లు సమాచారం. గతంలో ఆ రెండు పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్ కోసం పోటీ పడేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి.

కల్లోలితం నుంచి ప్రశాంత వాతావరణం

మూడు దశాబ్దాల క్రితం నక్సలైట్ ఉద్యమం తీవ్రస్థాయిలో ఉన్న సమయంలో చందుర్తి, కోనరావుపేట మండలాలు కల్లోలిత ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. ఆ సమయంలో ఇక్కడ విధులు కత్తిమీద సాములా ఉండేవి. కానీ నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎలాంటి భయాందోళనలు లేని వాతావరణం ఏర్పడింది. అయినా ఇక్కడికి వచ్చేందుకు పోలీస్ అధికారులు ఆలోచిస్తుండడంతో ఆయా ఠాణాల్లో ఎస్‌హెచ్‌వోల కుర్చీలు రెండు నెలలుగా ఖాళీగా ఉన్నాయి.

వంతెన పనులు పూర్తిచేయండి



వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని అడవిపదిరలో నిలిచిన వంతెన పనులు పూర్తిచేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఒక్కరోజు దీక్ష చేపట్టారు. మనోజ్‌కుమార్ మాట్లాడుతూ వంతెన పూర్తికాకపోవడంతోలాల్‌సింగ్‌తండా మీదుగా 3 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తుందన్నారు. వంతెన సమీపంలో తాత్కాలిక రోడ్డు వేయాలని కోరారు. మల్లయ్య, రవి, రాజం, శంకర్, ఆంజనేయులు, రామచంద్రం, సుదర్శన్, బాలకిషన్, నరేశ్, క్రాంతి, విష్ణు, మనోభిషేక్, కార్తీక్, రాబిన్‌సన్, హరోన్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలి



సిరిసిల్ల రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సమావేశమైన బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య, జాతీయ రహదారి బాధితులు

- మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలి
- జాతీయ రహదారి బాధితులు
- సిరిసిల్ల రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సమావేశం

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణ శివారు నుంచి ప్రతిపాదించిన జాతీయ రహదారి 365–బీ అలైన్‌మెంట్ మార్చేలా ఒత్తిడి పెంచాలని ఆ రహదారి బాధితులు కోరారు. జిల్లా కేంద్రం శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం సమావేశమయ్యారు. సిరిసిల్లలోని రహదారి భూనిర్వాసితులు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సోమవారం కరీంనగర్ వెళ్లి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలవాలని నిర్ణయించారు. గతంలో బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయి నష్టపోయామని, మానేరువాగు తీరంలో కరకట్ట కోసం, నర్సింగ్ కాలేజీ కోసం భూములు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. మరోవైపు సిరిసిల్ల పట్టణ పరిధిలో నుంచి కాకుండా, రైల్వేలైన్ వెంట జాతీయ రహదారిని నిర్మించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించాలని నిర్ణయించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేశ్, బాధితులు ఎర్రంవారి సురేశ్, ట్యాక్స్ కన్సల్టెంట్ కె.గోపి పాల్గొన్నారు.

అడవిలో నీటి పొదుపు

- జిల్లాలో రూ.40.41కోట్లతో పనులు
- కూలీలకు ఊతమిస్తున్న ఉపాధి
- భూగర్భజలాలు, నీటివనరుల పెంపు
- అటవీ ప్రాంతంలో పశువులకు సమృద్ధిగా తాగునీరు

జిల్లాలో పనుల వివరాలు ఇలా..

కూలీలు	1,03,000
జాబ్‌కార్డులు	73,000
పని దినాలు	17,41,000



అటవీలో నీటి నిల్వల కోసం కందకాల ఏర్పాటు



చెరువును తలపిస్తున్న కందకంలో నీటి నిల్వలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వృథా నీటిని ఒడిసిపట్టుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. అటవీ ప్రాంతంలో కంటిత కందకాలు తవ్విస్తూ నీటిని నిల్వ ఉండే పనులు చేపడుతుంది. గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా కందకం పనులు చేపడుతుంది. గతంలో రైతుల భూముల అభివృద్ధి, ఇతర పనులకే పరిమితమైన ఉపాధిహామీ పథకాన్ని విస్తరించి భూగర్భ జలాల పెంపు పనులు చేపడుతుంది. జిల్లాలోని 13 మండలాల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.40.41కోట్లతో పనులు చేపట్టారు. చెరువుల్లో పూడికతీత, ఫారంపాండ్స్, కండిత కందకాలు, ఫీడర్‌చానల్, ఇంకుడుగుంతల పనులు చేపడుతున్నారు.

జిల్లాలో చేపట్టిన పనులు

వివరాలు	పనులు	ఖర్చు చేసిన మొత్తం
చెరువుల పూడికతీత	158	రూ.2.13కోట్లు
ఫారంపాండ్స్	308	రూ.4.17కోట్లు
కండిత కందకాలు	330	రూ.9.03కోట్లు
ఫీడర్ చానల్	192	రూ.4.20లక్షలు
వర్షపు నీటి సంరక్షణ	06	రూ.18వేలు
బోర్‌వెల్ రీచార్జ్	33	రూ.2.08లక్షలు
ఇంకుడుగుంతలు	210	రూ.10.22 లక్షలు
కమ్యూనిటీ సోఫ్‌పిట్స్	78	రూ.7.41 లక్షలు


కూలీలకు ఉపాధి

జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులను నమ్ముకున్న కూలీలకు పక్క ఉపాధి లభిస్తుంది. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజులు పనికల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుపోతోంది. ఇందులో భాగంగా నూతనంగా శ్రీకారం చుట్టిన నీటిపొదుపు పనులు కూలీలకు వరంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా జాబ్‌కార్డులు ఉన్న 73 వేల కూలీలు 17.41లక్షల పనిదినాలు వినియోగించుకున్నారు. ఉపాధిలో కొత్తగా చేపట్టిన ఈ పథకం అటు రైతులకు ఇటు కూలీలకు ఊతమిస్తోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళా రైతు ఎల్లారెడ్డిపేటకు బీపేట రాజవ్వ. అడవిలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కందిత కందకంలో చేరిన నీటితో పశువుల దాహార్తి తీరుస్తున్నారు. గతంలో అటవీ ప్రాంతంలో కనుచూపు మేరలో నీటి నిల్వలు కనిపించక పశువులు ఇబ్బంది పడేవి. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి.


నీటి నిల్వలపై దృష్టి



ప్రభుత్వం వృథా నీటిని అరికట్టి నీటిని పొదుపు చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరంలో నీటి నిల్వలపై దృష్టి సారించి పనులు చేపట్టాం. ముఖ్యంగా వర్షపు నీరు వృథాకాకుండా అడవిలో కండిత కందకాలు, ఫారంపాండ్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తికాకముందే జిల్లా వ్యాప్తంగా 1,008 పనులు చేపట్టి రూ.40.41 కోట్లు ఖర్చు చేశాం.

– కొమురయ్య, ఏపీఎం, ఎల్లారెడ్డిపేట

రైతులకు ప్రయోజనం



అడవిలో వృథానీటిని ఒడిసి పట్టుకోవడానికి కండిత కందకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కండిత కందకాలు, ఫారంపాండ్స్, చెక్‌డ్యామ్‌ల ఏర్పాటును ఉపాధిహామీ పథకంలో చేపడుతున్నాం. అటవీప్రాంతంలో నీటి నిల్వలు పెంపొందడంతోపాటు కూలీలకు చేతినిండా పని దొరుకుతుంది. నీటినిల్వల పెంపుపై అందరూ సహకరించాలి.

– శేషాద్రి, డీఆర్డీవో



మహాత్మా.. మన్నించవా..!

- గాంధీజీ విగ్రహం కనిపించకుండా ఫ్లెక్సీలు
- ఇటీవల ఒకరికి జరిమానా
- అయినా మారని వైనం

సిరిసిల్ల: మహాత్ముల విగ్రహాలు కనిపిస్తే.. స్ఫూర్తిదాయకంగా ఉంటుందని గ్రామాల నడిబొడ్డున, చౌరస్తాలలో ఏర్పాటు చేస్తుంటారు. కానీ సిరిసిల్ల నడిబొడ్డున అందరికీ కనిపించేలా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం కనిపించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒకరు ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే సాక్షిలో కథనం ప్రచురితమైన తర్వాత మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వ్యక్తికి రూ.5వేల జరిమానా విధించడంతోపాటు దాన్ని తొలగించారు. ఆ సంఘటన మరువకముందే ఆదివారం కొత్తగా మరో రెండు ఫ్లెక్సీలు వెలిశాయి. ఇందులో ఒకటి ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌కు సంబంధించినది కాగా, మరొకటి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ఫ్లెక్సీ. పోలీసు సంస్మరణ వారోత్సవాలు ముగిసినా ఆ ఫ్లెక్సీని ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. మరోవైపు ప్రైవేటు ఫ్లెక్సీలు సైతం గాంధీ విగ్రహానికి అడ్డంగా ఏర్పాటు చేయడాన్ని పట్టణ వాసులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఇక వీళ్లు మారరు.. మహాత్మా మన్నించవా.. అంటూ స్థానికులు తలపట్టుకుంటున్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

కమాన్‌పూర్(మంథని): గుండారం గ్రామానికి చెందిన నది నరేశ్(24) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. నరేశ్ శనివారం రాత్రి గ్రామ శివారులో పురుగుల మందు తాగానని కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్‌తో సమాచారం అందించగా.. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని నరేశ్‌ను పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. నరేశ్ ట్రాక్టర్, వరికోత మిషన్లపై డ్రైవర్‌గా పని చేసేవాడు. నరేశ్ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

విద్యార్థి అదృశ్యం


సాయిగణేశ్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌కు చెందిన బొమ్మెన తిరుపతి కుమారుడు సాయిగణేశ్(17) అనే ఇంటర్ విద్యార్థి శనివారం నుంచి కన్పించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం తండ్రి తిరుపతి తన కుమారుడు కన్పించడం లేదంటూ కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బొమ్మకల్ పంచాయతీ పరిధిలోని కృష్ణానగర్‌కాలనీలో బొమ్మెన తిరుపతి టీ కొట్టు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తిరుపతి కుమారుడు సాయిగణేశ్ కరీంనగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం కళాశాలకు పోతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయిగణేశ్ రాత్రయినా తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇంట్లో సాయిగణేశ్ ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన ఐదుగురిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చిందని గ్రామస్తులు తెలిపారు. నేదూరి రమేశ్, గడ్డం పుష్పవ్వ, గోపి ప్రకాశ్‌తోపాటు మరో ఇద్దరిపై దాడి చేసిందన్నారు. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): వేధింపులకు పాల్పడిన ఘటనపై గ్రామంలో పంచాయితీ చేస్తున్న క్రమంలో దాడికి పాల్పడిన ఓ వ్యక్తి, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆరోగ్యం ఆదివారం తెలిపారు. పాపయ్యపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన గెల్లు మహేందర్ మూడు రోజుల క్రితం వ్యవసాయ పనులకు వెళ్తున్న సమయంలో వేధింపులకు పాల్పడ్డాడు. భర్త, కుటుంబ సభ్యులు కలిసి గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేస్తున్న క్రమంలో వివాహిత, భర్తపై దాడికి పాల్పడ్డారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. కథలాపూర్ మండలంలోని ఓ వాగు నుంచి నిజామాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గ మధ్యంలో డిపో వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఐ పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం లారీ యజమాని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. లారీ యజమానులు అనుమతులు తీసుకొని ఇసుకను తరలించాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

రెండేళ్ల బాలుడి కిడ్నాప్!

- హైదరాబాద్‌లో ఆచూకీ గుర్తించిన పోలీసులు
- బెగ్గింగ్ మాఫియాకు అమ్ముతుండగా పట్టివేత

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీం'నగరం'లో రెండేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం రేపింది. కిడ్నాప్‌ను సవాల్‌గా తీసుకున్న పోలీసులు.. కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నగరంలోని వన్‌టౌన్ పరిధిలో నివసిస్తున్న ఓ మహిళకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆమెకు బాగా సన్నిహితంగా ఉండే ఓ స్నేహితురాలు.. బాబును ఆడించినట్లు నటించి తన వెంట తీసుకెళ్లింది. తన బాబు కనబడకపోయేసరికి సదరు తల్లి తల్లడిల్లిపోయింది. చుట్టుపక్కల వెదికి.. చివరికి వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితురాలు బాబుతో హైదరాబాద్ వెళ్లినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ల ఆధారంగా కిడ్నాప్ చేసిన మహిళ, బాబును గుర్తించారు. అక్కడ బాబును రూ.50వేలకు బెగ్గింగ్ మాఫియాకు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా.. ఆ ప్రయత్నాన్ని పోలీసులు సకాలంలో చేరుకుని భగ్నం చేయగలిగారు. బాబును కాపాడిన పోలీసులు.. మహిళను అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం సదరు కిడ్నాప్ ఘటన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది. 2022 ఆగస్టులో అశోక్‌నగర్‌కి చెందిన ఓ బాలికను ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేయగా వన్‌టౌన్ పోలీసులు 24 గంటల్లో పాప ఆచూకీ కనిపెట్టారు. 2023 ఫిబ్రవరిలోనూ టూటౌన్ పరిధికి చెందిన ఓ మహిళ తన పొరుగింట్లో ఉండే ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి మహారాష్ట్ర తీసుకువెళ్లిన ఘటన అప్పట్లో కలకలం రేపిన విషయం తెలిసిందే.

కేంద్రాలు సరే.. కొనుగోళ్లేవి?

- జాప్యాన్ని నిరసిస్తూ పార్లమెంట్ పరిధిలో నిరసనలు
- నేడు తహసీల్దార్లకు వినతిపత్రాలు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా నేటికీ వడ్ల కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం బాధాకరమని, ఈ విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, ఆచరణకు పొంతనే లేకుండా పోయిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 7,572 వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం వాటిలో ఇప్పటికే 4,598 కేంద్రాలను తెరిచినట్లు పేర్కొందని, కానీ తమకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క కేంద్రంలోనూ ఇంతవరకు వడ్ల కొనుగోలు ప్రారంభమే కాలేదన్నారు. వడ్ల కుప్పలతో కేంద్రాలన్నీ నిండిపోవడంతో స్థలం లేక ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోడ్లపై రాశులుగా పోస్తున్నారని తెలిపారు. దీంతో రైతులకు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడ్లు తడిసిపోయాయని, చాలా చోట్ల కోతకు వచ్చిన పంట నీటిపాలైందన్నారు. తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా తడిసిన ప్రతీ గింజను కొనాలన్నారు. అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతుల పక్షాన త్వరలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. అందులో భాగంగా బీజేపీ శ్రేణులు సోమవారం అన్ని మండల కార్యాలయాలకు వెళ్లి తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

జువ్వాడి సూర్యారావుకు కన్నీటి వీడ్కోలు


తిమ్మాపూర్‌లో సూర్యారావు అంత్యక్రియల్లో విప్ అడ్లూరి


సూర్యారావు మృతదేహం వద్ద భార్య, కూతుళ్లు

ధర్మపురి: దివంగత జువ్వాడి రత్నాకర్‌రావు సోదరుడు జువ్వాడి సూర్యారావు మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందగా.. మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన మండలంలోని తిమ్మాపూర్‌కు తీసుకొచ్చారు. అంతిమయాత్రలో ప్రభుత్వ విప్, వందలాది మంది పాల్గొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు తదితరులు పాల్గొన్నారు. సూర్యారావుకు యనకు భార్య భారతి, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

సూర్యారావు కూతురు హైకోర్టు జడ్జి

సూర్యారావు నలుగురు కూతుళ్లలో పెద్ద కూతురు శ్రీదేవి ప్రస్తుతం హైకోర్టు జడ్జి. రెండో కూతురు శ్రీలత, మూడో కూతురు శ్రీకుమారి, నాలుగో కూతురు శిరీష. హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్న పెద్ద కూతురు శ్రీదేవి తండ్రికి తలకొరివి పెట్టడం అందరిని కలచివేసింది. తండ్రి మరణంతో కూతుళ్లు శోక సంద్రంలో మునిగారు.

సమస్యల పరిష్కారానికి కృషి


ప్రచారం చేస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని, ప్రైవేటు విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని గిద్దెపెరుమాండ్లస్వామి ఆలయ మైదానంలో వాకర్స్‌తో, జిల్లా గ్రంథాలయంలో పట్టభద్రులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సమాయత్తమవుతున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అల్ఫోర్స్ పక్షాన ఉచిత యాప్ అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు నవంబర్ 6 లోపు తమ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ వరకు ప్రాంతీయ క్రీడా పాఠశాల

- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి


మాట్లాడుతున్న శివసేనారెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలను వచ్చే సంవత్సరం నాటికి ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేస్తానని, పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఎక్కడికి వెళ్లకుండా ఇక్కడే ఉండి క్రీడల్లో రాణించి దేశానికి పతకాలు అందించే క్రీడాకారులుగా తయారు కావాలని శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులకు సూచించారు. ఆదివారం రాత్రి ఆయన ఆకస్మికంగా క్రీడా పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులు, గ్రంథాలయం గది పరిశీలించారు. బాక్సింగ్, జూడో, స్విమ్మింగ్ పూల్, సింథటిక్ ట్రాక్, విద్యార్థుల హాస్టల్ గదులను చూశారు. విద్యార్థులు ఆయా క్రీడల్లో తీసుకుంటున్న శిక్షణను కోచ్‌లనడిగి తెలుసుకున్నారు. శిక్షణ ఎలా పొందుతున్నారో విద్యార్థులను అడిగారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వారు గొప్ప స్టార్లుగా ఎదుగుతారన్నారు. హకీంపేట స్కూల్ తరహా మీకు కూడా అన్ని సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు పవన్, సాయిరాం, శ్యామ్, చందు, సంపత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జాప శ్రావణ్‌రెడ్డి, కిమ్ ఫహాద్, గట్టు ప్రశాంత్, ఆకుల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్


సెల్ టవర్ ఎక్కిన రాకేశ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని సెల్ టవర్‌పైకి పెద్దపల్లి మండలం రాఘవపూర్‌కు చెందిన ఇంజాల రాకేశ్ ఆదివారం ఎక్కి హల్‌చల్ సృష్టించాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. రాకేశ్ తన గ్రామంలో కొందరితో ప్రాణభయం ఉందని, ఎవరూ పట్టించుకోవడం లేదని మానస్తాపం చెంది సెల్ టవర్ ఎక్కాడు. దాదాపు రెండు గంటలపాటు హైడ్రామా సృష్టించగా.. ఎస్సై, సీఐ సుబ్బారెడ్డి, బాధితుడి కుటుంబ సభ్యులు నచ్చజెప్పారు. కిందకు దిగగా.. పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

జగిత్యాలక్రైం: గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం జగిత్యాల పట్టణంలోని రాజీవ్ బైపాస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టగా.. అనుమానాస్పదంగా స్కూటీపై వెళ్తున్న యువకులను తనిఖీ చేస్తే గంజాయి లభించిందన్నారు. జగిత్యాల రూరల్ మండలం బాలెపల్లి గ్రామానికి చెందిన జక్కుల మధు, పెగడపల్లి మండలం వెంగళాయపేటకు చెందిన రాచర్ల వంశీ, పాలకుర్తి మండలం కుక్కలగూడురుకు చెందిన నలిమెల వినోద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకొచ్చి జగిత్యాలలో యువకులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్నారు. వంశీపై గతంలో రెండు గంజాయి కేసులు నమోదయ్యాయని, వినోద్‌పై ఏడు కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయని అన్నారు. ఎస్సై మన్మథరావు, కిరణ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు


యమధర్మరాజుకు పూజలు చేస్తున్న అర్చకుడు

ధర్మపురి: ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదని వేద పండితుడు బొజ్జ రమేశ్‌శర్మ పేర్కొన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో ఆదివారం యమ ద్వితీయ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆయుష్య హోమం హారతి, మంత్రపుష్పము తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ, ప్రపంచంలో యమ ధర్మరాజు ఆలయం ఒక్క ధర్మపురిలోనే ఉందని, ప్రతీ నెల భరణి నక్షత్రము, ఏటా యమ ద్వితీయ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

6 గంటలు.. 72 పాటలు

- ఐదు బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పిన సింగర్ సల్వాజీ సంధ్య


రికార్డు అందుకుంటున్న సల్వాజీ సంధ్య దంపతులు

కరీంనగర్‌కల్చరల్: ఆరు గంటలపాటు నిర్విరామంగా 72 పాటలు పాడి ఐదు బుక్ ఆఫ్ రికార్డులు నెలకొల్పింది కరీంనగర్‌కు చెందిన గాయనీ సల్వాజీ సంధ్య. కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో ఆదివారం సల్వాజీ ప్రవీణ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగర్ సల్వాజీ సంధ్య ఆరు గంటల పాటు 72 పాటలు పాడి ఐదు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లు నెలకొల్పింది. భరత్ వరల్డ్ రికార్డు, సింగర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డు, కల్చరల్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్‌లో చోటు సంపాదించింది. వరల్డ్ రికార్డ్ కో– ఆర్డినేటర్ కేవీ.రమణరావు పర్యవేక్షణలో ఎనిమిది మంది వాయిద్యా కళాకారుల సాయంతో సంధ్య ప్రముఖ గాయని కే.ఎస్.చిత్ర పాటలను పాడింది. ఆర్.అనిల్, ఎం.ప్రశాంత్, ఎస్.మహేందర్, కె.వినోద్, సతీశ్, సాయి, సత్యం, మల్లేశ్ సంగీత సహకారం అందించారు. ఈ సందర్భంగా సంధ్యను గాయకులు, అధికారులు, కళాకారులు అభినందించారు. ఆర్డీవో మహేశ్వర్, కేఎస్.అనంతచార్య, జి.కృపాదానం, వి.గోపాల్‌రావు, సల్వాజి ప్రవీణ్ పాల్గొన్నారు.

చిన్నారి బతుకు పోరాటం

- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వైనం
- దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు


దాతలు ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకుంటున్న చిన్నారి అనన్య

ఫోన్ పే నంబర్: 9963663653

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తోటి పిల్లలతో ఆడుతూపాడుతూ చదువుకోవాల్సిన ఓ చిన్నారి నాలుగేళ్ల వయస్సులోనే బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. తనకు వైద్య చికిత్స కోసం దాతలు ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకుంటోంది. కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన తాళ్లపల్లి అనూష–ప్రశాంత్ కూతురు అనన్యను బ్లడ్ క్యాన్సర్ వేధిస్తోంది. వైద్యం కోసం అనన్య తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. రూ.10లక్షలు చెల్లిస్తేనే వైద్యం అందిస్తామని వైద్యులు పేర్కొన్నారు. డబ్బుల్లేని ఆ నిరుపేద కుటుంబం దాతలు సాయం చేయాలని వేడుకుంటోంది.

పత్తి తూకంలో మోసం


వాహనాన్ని పట్టుకున్న గ్రామస్తులు, రైతులు

ధర్మపురి: పత్తి తూకంలో మోసం చేసి పారిపోతున్న దళారులను గ్రామస్తులు, రైతులు పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. తుమ్మెనాల గ్రామానికి చెందిన అప్పాల మల్లయ్య పత్తిని ఆదివారం పత్తి దళారులు ఎలక్ట్రానిక్ కాంటాలో తూకం వేశారు. రైతు నుంచి కొనుగోలు చేసిన పత్తి 5క్వింటాళ్ల12కిలోలని చూపించారు. కాని రైతు అంతకుముందే ఇంటి వద్ద తూకం వేసుకోగా.. 6క్వింటాళ్ల77కిలోలు ఉంది. 165 కిలోల పత్తి తక్కువగా వచ్చింది. పసిగట్టిన రైతు దళారిని ప్రశ్నించే లోగా వ్యాన్‌తోపాటు పరారయ్యాడు. గ్రామస్తులు, రైతులు వ్యానును వెంబడించి గ్రామ శివారులో పట్టుకొని డ్రైవర్‌తోపాటు కూలీలను పోలీసులకు అప్పజెప్పారు. పత్తి వ్యానును పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ముందుగానే తూకం వేసుకొని విక్రయించడానికి సిద్ధంగా ఉండాలని పోలీసులు సూచించారు.

చదువుకోవాలని ఉంది.. సాయం చేయండి

ఫోన్ పే, గూగుల్ పే
న్యాత రాజం 9121349332,
బర్ల అనుదీప్ 8497950725


సోషల్ మీడియాలో సర్టిఫికెట్లు చూపుతున్న అక్షయ

మేడిపల్లి(జగిత్యాల): చదువుల తల్లికి విద్య కొనలేని ఆపదొచ్చింది. సోషల్ మీడియా వేదికగా చదువుకోవాలని ఉంది.. సాయం చేయండని ఓ నిరుపేద విద్యార్థిని పోస్ట్ చేయడం స్థానికంగా చర్చకు దారి తీసింది. కాచారం గ్రామానికి చెందిన న్యాత అక్షయ తన కుటుంబ పరిస్థితిని వివరిస్తూ.. తనకు ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వచ్చిందని, బీఎస్సీ నర్సింగ్ ఆసిఫాబాద్‌లో సీటు వచ్చిందని తెలిపింది. ప్రస్తుతం ఎంట్రెన్స్ ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నానని, దాతలు సాయం చేయాలని కోరింది. అక్షయ తల్లి చిన్నతనంలోనే చనిపోయిందని, తండ్రి కంటిచూపు సరిగా లేక ఇంటిపట్టునే ఉంటాడని గ్రామస్తులు తెలిపారు. అక్షయ ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కస్తూర్బా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుందని, దాతలు సాయం చేస్తే తన భవిష్యత్తు బాగుంటుందన్నారు. సాయం చేసేవారు కింది నంబర్లకు పంపించాలని వారు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో అంధకారం


కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో చీకట్లో ప్రయాణికులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో అధికారుల నిర్లక్ష్యంతో అంధకారం నెలకొంది. ఆదివారం రాత్రి 7 గంటలకు తిరుపతికి వెళ్లాల్సిన ప్రయాణికులు చీకట్లో పడరాని పాట్లు పడ్డారు. ప్లాట్‌ఫారంపై కేవలం ఒక్కటే ఫ్లడ్ లైట్ ఉండటంతో దూరంగా ఉన్న రైలును ఎక్కేందుకు చీకటి ఉండటంతో కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుగులో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమృత్‌మాల పథకంలో భాగంగా కరీంనగర్ రైల్వే స్టే షన్ ఆధునికీకరణ పనులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యుదీకరణ పనులు నడుస్తున్నాయనే సాకుతో అధికారులు స్టేషన్‌లో విద్యుత్ లైట్లను ఆన్ చేయకపోవడంతో రాత్రంతా చీకటిగానే ఉంటోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. నెల రోజుల నుంచి స్టేషన్ ప్రాంగణమంతా చీకట్లోనే ఉంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

'రాజన్న'కు భక్తుల రద్దీ





వేములవాడఅర్బన్: కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో ఆదివారం భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి పవిత్రమైన ధర్మగుండంలో స్నానాలాచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కోడె మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

